

కీసర మండలం కరీంగూడ గ్రామంలో ఓటు వేసేందుకు పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచి ఉన్న ఓటర్లు

# ఈవీఎంలో.. ఓటరు నిర్ణయం

## సాయంత్రం 5 గంటల వరకు 54.62శాతం పోలింగ్

### మేడ్చల్‌లో ప్రశాంతంగా ఎన్నికలు

### 3న భవితవ్యం

- ఉదయం 7 గంటలకు పోలింగ్ షురూ
- మధ్యాహ్నం వరకూ మందకోడిగా పోలింగ్
- వికలాంగులు, వృద్ధులకు చేయూత
- ఆకట్టుకున్న మోడల్ పోలింగ్ కేంద్రాలు
- పలు కేంద్రాలను సందర్శించిన మంత్రి మల్లారెడ్డి, ఇతర అభ్యర్థులు



జవహర్‌నగర్‌లో ఓటువేసిన మేయర్ మేకల కావ్య

మేడ్చల్ జోన్ బృందం, నవంబర్ 30 : మేడ్చల్ నియోజకవర్గంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరుగలేదు. రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సామరస్యంగా వ్యవహరించారు. పకడ్బందీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉన్న వ్యాపార, వాణిజ్య సంస్థలను మూసివేయించారు. ఓటర్లు క్యూలో నిల్చొని, ఓటు హక్కును వినియోగించుకున్నారు. వృద్ధులు, వికలాంగులు, ప్రత్యేక అవసరాల వారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు చేయూతనిచ్చారు. వీల్‌చైర్‌లో తీసుకెళ్లి, నేరుగా ఓటు వేయించారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఐదు చోట్ల ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాలు ఆకట్టుకున్నాయి.

### 3 గంటల తర్వాత తరలివచ్చిన ఓటర్లు

ఓటర్లు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మోస్తారుగా ఓటు వేయడానికి వచ్చారు. 5 గంటల వరకు పోలింగ్ సమయం ముగియనున్నందున 3 గంటల తర్వాత ఓటు వేయడానికి తరలివచ్చారు. దీంతో పోలింగ్ కేంద్రాలు కిక్కిరిసిపోయాయి. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. సాయంత్రం 7 గంటల దాటినా పోలింగ్ కొనసాగింది.

### పలు కేంద్రాలను సందర్శించిన మంత్రి

మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. బోడుప్పల్, పీర్జాదిగూడ, కీసర, నాగారంలలో పర్యటించి, పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రజాప్రతినిధులు, నాయకులు తమ ఓటు హక్కును వినియోగించున్నారు. కొత్తగా ఓటు హక్కును పొందిన వారు ఓటు వేయడానికి ఉత్సాహం చూపారు. పోలింగ్ రోజు ఇచ్చిన సెలవును ఆనందంగా గడపడానికి కాకుండా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా తాగునీరు, టెంట్లు తదితర సౌకర్యాలను కల్పించారు.



ఘట్‌కేసర్‌లో ఓటు వేసిన చైర్‌పర్సన్ ముల్లి పావనీ జంగయ్యయాదవ్ దంపతులు

**మందకోడిగా పోలింగ్**

| సమయం | పోలింగ్ శాతం |
|---|---|
| ఉదయం 7 నుంచి 9 గంటల వరకు | 2.4 శాతం |
| ఉదయం 9 నుంచి 11గంటల వరకు | 15.31శాతం |
| ఉదయం 11 నుంచి 1గంట వరకు | 28.25 శాతం |
| మధ్యాహ్నం 1నుంచి 3 గంటల వరకు | 42.17శాతం |
| మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు | 54.62 శాతం |



మేడ్చల్ మండల పరిధి బండమాదారం గ్రామంలో బారులు తీరిన ఓటర్లు



జవహర్‌నగర్‌లో పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ డీఎస్ చౌహాన్



పీర్జాదిగూడలో ఓటుహక్కును వినియోగించుకున్న కార్పొరేటర్ మంజుల వీరేందర్, నాయకులు



చీర్యాల్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరలక్ష్మీనారాయణ, బీఆర్ఎస్ నేతలు



నాగారంలో ఎన్నికల సరళిని పరిశీలించిన అనంతరం బీఆర్ఎస్ నేతలతో మంత్రి చామకూర మల్లారెడ్డి



ముఖ్యమంత్రి దత్తత గ్రామం కేశవరంలో ఓటు హక్కును వినియోగించుకున్న గ్రామస్తులు



గౌడవెల్లి గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎంపీపీ పద్మాజగన్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు



ఘట్‌కేసర్ శివారెడ్డి గూడలో ఓట్లు వేయడానికి క్యూలైన్‌లో ఉన్న మహిళలు



దమ్మాయిగూడలో ఓటు హక్కు వినియోగించున్న ఓటర్లు



కండ్లకోయలో ఓటు హక్కును వినియోగించుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నేతలు



నాగారంలో వృద్ధుడిని వీల్‌చైర్‌లో ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న మున్సిపాలిటీ సిబ్బంది